
# మనుసులున్నారు ! జాగర్త...

-రసరాజు

**రూ. 3,000 ప్రత్యేక బహుమతి పొందిన కథ**




**''ఏవయ్యో..'' దూబమ్మ పొద్దున్నే లేచీలేవడంతోనే భర్తను పిలిచింది.**

**''ఏటే..''**

**''తెల్లారగట్ట సిన్నోడు కల్లోకొచ్చాడయ్యా.. ఓసారి సూసొత్తే పోలా..''**

**''అక్కడికి మనం దేనికే?''**

**''అదేంటయ్యా..కూటికోసం పోతామా యేటి.. ఎంతయినా బిడ్డాడాయే..''**

**''బిడ్డడే..నే మాత్రం కాదన్నానా! ఆడికే మనమీద లేదు..''**

''పోన్లేవయ్యా.. మన పేగుబందం మనది.. సంటిది అచ్చం నాలాగే వుంటుందంట! ఎప్పుడో చూశాం..దానికిప్పుడారో యేడు..''

''నీ కళ్ళొచ్చాయట కదా దానికి..'' అన్నాడు నర్సింహయ్య చుట్ట ముట్టిస్తూ.

''కళ్ళేమో నాయి, ముక్కేమో నీదంట.. ఆ మద్దెన పెద్దోడొచ్చి ఎంత ముచ్చటపడుతూ చెప్పాడు ఇన్లేదా?''

''ఇన్నా.. ఇంకా ఇన్నా''

''పోన్లేవయ్యా..''

''పోన్లే కాకపోతే నేనేవన్నా పట్టుకొని ఏలాడుతున్నానా యేటి.. అది సరేగాని నీ బెంగ సంటి దాని మీదా? సిన్నోడి మీదా?''

''ఎవరి మీదయితేనే..అందర్నీ సూద్దాం పదా! రేపట్నుంచి ఎలాగూ పొలం పనులు లేవుగా..కలల్లో ఆల్లే మెదులుతున్నారనుకో..'' దూబమ్మ బెంగగా అంది.

''సర్లే..సందకాడే రాయుడు గారి దగ్గర డబ్బులట్టుకొత్తాగాని..రేప్పొద్దుటే బయల్దేరాలి మరి! తయారుగా ఉండు!'' ఆ మాట వినగానే దూబమ్మ దూది వత్తుల్లా వెలిగాయి.

ఆ మధ్యాహ్నమంతా కూర్చోని పోలెమ్మ సాయంతో జంతికలు, పొంగడాలు వండింది. అన్నీ డబ్బాల్లో

కథ

సర్దింది. సంక్రాంతికి పెద్దోడు కొన్న చీర, పెట్టెలో నలగకుండా బహుభద్రంగా పెట్టుకొంది. కోడికూతకు ముందే లేచి తాటి రొట్టె కాల్చాలనుకుంది. ఆ రాత్రి దూబమ్మకు కునుకే రాలేదు. కళ్ళల్లో సిన్నోడు.. ఆ సిన్నది..కోడలు రాణెమ్మ.. ఆ ఇల్లు.. ఆ గొప్ప.. ఇవే కదలాడాసాగాయి.

* * *

నర్సింహయ్య తలపాగా బిగించాడు. నెత్తిమీద ట్రంకుపెట్టె పెట్టుకున్నాడు. ఆ వెనకే దూబమ్మ.. ఆమె రెండు చేతుల్లో రెండు చిన్న సంచులు, ఆ సంచుల్లో డబ్బాలు.. అందులో జంతికలూ, పొంగడాలూ..తాటిరొట్టె..

ఇద్దరూ సఖినేటిపాలెం రేవు దాటి వలంధర రేవుకి చేరుకున్నారు. నరసాపురం రైల్వేస్టేషన్లో అడుగుపెట్టేసరికి ఉదయం ఏడున్నరయింది. గుడివాడ వరకు వెళ్ళే బండి సిద్ధంగా వుంది. అక్కణ్ణుంచి విజయవాడకు వేరే బండెక్కాలి. గుడివాడలో దిగేసరికి నర్సింహయ్యకు ఆకలేసింది.

వేరే బండిలోకి మారాక ''తాటిరొట్టె కొంచెం పెట్టవే..'' అన్నాడు నర్సివయ్య.

''ఈ ఒక్కపూటకీ కొంచెం కడుపుకట్టుకోవయ్యా! ఇది సిన్నోని కోసం సేసింది'' దూబమ్మ బంగారం దాచినట్టుగా మాట్లాడింది.

ఆకలితో నోరు తెరిచి అడిగినా మొగుడికి అలా బదులు చెప్పడం దూబమ్మకు బాధే అనిపించినా, కొడుకు మీది మమకారం కొద్దీ దాన్ని భరించింది.

''పేద్ద బంగళా అటగా మన సిన్నోడుండేది..'' మీసం మీద చెయ్యేస్తూ పెళ్లాం ముఖంలోకి చూశాడు నర్సింహయ్య.

''పనోల్లకి లోటే లేదంట! కాలు కింద పెట్టే పనుండదంట! ఎప్పుడో రేండేళ్ళ క్రితం వెళ్ళాం, తిరుపతిలో వుద్యోగం సేత్తున్నప్పుడు. అయినా అప్పుడింత హోదా లేదుగా..'' కొడుకు గొప్పతనానికి దూబమ్మ పొంగిపోతూ అంది.

''నువ్వెన్ని సెప్పు..అక్కడ మనం వుండలేమె దూబీ''

''దేనికుండలేం?'' దూబమ్మ ప్రశ్నించింది.

''దేనికేవుంది. మనిల్లు మనకలవాటు! ఆ దర్జాకి మనం సరిపోం! అయినా రాణెమ్మకి మనం ఆనం కదా!''నర్సివయ్య మనసులో మాట చెప్పేశాడు.

''పోన్లేవయ్యా, వారం రోజులే వుందాం. నచ్చకపోతే అప్పుడే మన రాజోలొచ్చేద్దాం..సరేనా! సంటిదాన్నీ, సిన్నోణ్ణీ.. ఆ అందాల్నీ సూత్తుంటే అసలు కూడూ,కునుకు గుర్తుంటాయంటావా..''

''ఆ మంచాలు, పరుపులూ సూసి పెద్దోడు ఒకటే ఇదిగా చెబుతుంటే నిజం సెప్పొద్దూ..నాకూ ఆటిమీద పడుకోవాలనిపించిందే!''

''నాకు అనిపించిందయ్యో.. ఆ కార్లు అవీ ఎక్కాలని..''

''వెళ్తున్నాంగా! అన్నీ సూడోచ్చు. మరీ తలుచుకుంటే దిష్టి తగుల్తుందే ఎర్రిమొగమా! ఇక మానెయ్.. ఆ వూసులు'' నర్సింహయ్య తలపాగా బిగదీస్తూ అన్నాడు.

* * *

విజయవాడలో బండి దిగేసరికి– మధ్యాహ్నం ఒంటిగంటయింది. అప్పటికే వర్షం కుండపోతగా కురుస్తోంది.

ఇల్లు కనుక్కోవటం ఇబ్బందని, పెద్దోడిచ్చిన చీటిని రిక్షావాలాకి చూపించాడు నర్సింహయ్య.

''ఎక్కండి..పది రూపాయలు..''అన్నాడు రిక్షావాలా.

''ఎనిమిదిత్తాం..'' అన్నాడు నర్సింహయ్య. వాళ్లిద్దరి పరిస్థితిని చూసి ''సరే'' అన్నాడు.

రిక్షా వెళ్లి బందరు రోడ్డు సందులో ఓ పెద్ద బంగళా ముందు ఆగింది. రిక్షవాలా గేటు దగ్గరికెళ్ళి ఏదో మాట్లాడాడు.

''ఇదే..'' అన్నాడు గేట్‌మెన్. రిక్షా దిగి గేటు దగ్గరికొచ్చారు.

''పక్కకు తప్పుకోండి..అయ్యగారొస్తున్నారు'' అన్నాడు సరిగ్గా అప్పుడే గేట్‌మెన్. కారు గేట్ దాటి ఒక్క నిమిషం ఆగింది.

ఎదురుగా తల్లి..తండ్రి..వానలో తడుస్తూ. దుర్గరావు గ్లాస్ డోర్ తెరిచి కార్లోంచే మాట్లాడాడు.

''ఇంత వర్షంలో రాకపోతేనో!సరే నడవండి..





సాయంత్రమొస్తాను. ఏయ్ లోపలికి తీసుకెళ్ళు'' అంటూ గేట్‌మెన్‌కి పురమాయించాడు. ఆ ఇద్దరూ అలాగే చిన్న కొడుకును చూస్తూ గేటు దాటి లోపలికి అడుగుపెట్టారు. వాళ్ళ రాకను పైనుంచి రాణి గమనించింది.

రెండు చేత్తుల్లో రెండు సంచులు..

నెత్తి మీద పెట్టె..

అప్పటికే తడిసిముద్దయిపోయిన వాళ్ల వాలకాలు..

''కుళాయి దగ్గర కాళ్లు కడుక్కోమను..స్టోర్ రూమ్ పక్కగదిలోకి తీసికెళ్లు'' అక్కణ్ణుంచే హుకుం జారీ చేసింది.

''అలాగే అమ్మగారు'' అన్నాడు గేట్‌మెన్. దూబమ్మ, నర్సింహయ్య పైకి చూశారు.

కోడలురాణెమ్మ.. నర్సివయ్య పలకరించాడు. ఆమె పట్టించుకోలేదు. ఇద్దరూ గేట్‌మెన్ వెనకాలే నడిచారు. లోపలికెళ్లాక పెట్టెలో తుండు తీసుకుని తలతుడుచుకుంటుండగా రెండు కుక్కలొచ్చాయి. వాటిని చూడగానే ఇద్దరికీ వణుకు పుట్టింది.

ముందు హడావిడి చేసినా, ఆ తరువాత అవి వాసన చూసి మౌనంగా వెళ్లిపోయాయి.

అవును మరి! వాటి దృష్టిలో ఆ ఇంటి యజమాని నెత్తురూ, తమ నెత్తురూ ఒకటే కదా.. ఇరవై నిమిషాలు గడిచాయి. రాణి కిందికొచ్చింది. ఆ ఇద్దర్నీ చూసేసరికి కంపరం పుట్టుకొచ్చింది.

ఒకరి కళ్లల్లో పుసులు –అసహ్యంగా, మరొకరి నోట్లోంచి చుట్ట కంపు..

''ఎంతయినా మట్టి పిసుక్కునే రకం'' రాణి మనసులోనే గొణుక్కుంది.

''వర్షంలో రాకపోతేనేం! భోంచేయండి.. కిందికే పంపిస్తా..పైకి మీరెక్కలేరు..పాలరాళ్లు..జారి పడతారు'' అంటూ రాణి గడుసుతనాన్ని ప్రదర్శించింది.

## సంగీతానికి సరిహద్దులు లేవు!

**ఆనంద్, గోదావరి, గమ్యం హిట్ చిత్రాల హీరోయిన్ కమలినీ ముఖర్జీకి సంగీతం అంటే చాలు! ఎంతిష్టమో! సంగీతానికి సరిహద్దులు లేవంటూ ఉంటే గింటే తనున్న మూడే హద్దంటుంది కమలిని. రాక్ మ్యూజిక్ అంటే తనకి చాలా ఇష్టమని చెబుతూ ఇండియన్ మ్యూజిక్‌లో అయితే ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ ఇష్టమని, ఫ్లూట్, సంతూర్ వాదనలంటే చెవి కోసుకుంటానంటోంది. రాహుల్ శర్మ సంతూర్ వాదన విన్న దగ్గర్నుంచి సంతూర్ వాదనంటే పిచ్చిగా నచ్చేస్తోందని అంటోందామె. ప్రస్తుతం 'హ్యాపీ డేస్' సినిమా పాటలు వింటోందట ! ఆ పాటల్ని ఎన్నిసార్లు విన్నా ఇంకా వినాలనిపిస్తోంది అని చెబుతోందామె.**

''అలాగే తల్లీ..'' నర్సింహయ్య తలూపాడు.

''సిన్నదేదమ్మా..'' ఉండబట్టలేక అడిగింది దూబమ్మ.

''ఎవరూ సుస్మితా.. కాన్వెంటుకెళ్లింది. సాయంత్రానికి గాని రాదు. ఏది కావాలన్నా పని కుర్రాడు కిందనే రెడీగా ఉంటాడు'' అంటూ రాణి చకచకా మేడమీదికెళ్లిపోయింది.

''పాలరాళ్ల మీద మనమే పడిపోతామట, అవి దగారు చూశావా మరి ఎంత మెల్లగా పడిపోకుండా ఎక్కిందో మెట్లు'' నర్సింహయ్య వ్యంగ్యంగా పెళ్లాంతో అన్నాడు.

''అదే మరి సిరంటే'' దూబమ్మ అంత వ్యంగ్యంగానూ మొగుడితో శృతి కలిపింది. ఆమె చెప్పినట్లుగానే పైనుంచి భోజనం వచ్చింది.

ఇంతలో ఫోన్ మోగింది. బాయ్ మాట్లాడాడు.

''అలాగే అమ్మగారూ..'' అంటూ ఆ కుర్రాడు స్టోర్‌రూమ్‌లో ప్లేట్లు తీసుకొచ్చాడు. ఏవేవో కూరలు, అన్నీ కొత్తగా వున్నాయి. కొన్నయితే మరీ చప్పగా వున్నాయి. మరి కొన్నింటిలో కారం తక్కువ..పెరుగు మరీ చల్లగా వుంది.

భోం చేశాక ఇద్దరూ వరండాలోకొచ్చి అటూ ఇటూ చూశారు. అన్నీ పూలమొక్కలే! ఓ చోట నీళ్లు పైకి చిమ్ముతున్న దృశ్యం కనిపించింది. దానికి దూరంగా ఉయ్యాల.. ఇల్లు కొడుకు హోదాకీ, దర్జాకీ తగ్గట్టుగానే ఉందనుకున్నారు.

''ఇందాక ఎవరు బాబు ఫోన్ చేసింది?'' వరండాలో కూర్చున్న కుర్రాణ్ణి అడిగాడు నర్సివయ్య.

''పైనుంచి అమ్మగారండి..''

''ఏటీ.. ఇక్కడికిక్కడే'' దూబమ్మ ఆశ్చర్యంగా అడిగింది. నోళ్లుండగా ఇదేం పని అనుకుంది.

''దేనికో?'' నర్సివయ్య మాములుగా అడిగాడు.

''స్టోర్‌రూమ్‌లో ప్లేట్లు తీసుకొచ్చి మీకు భోజనాలొడ్డించమన్నారండి. బయటి మనుసులొత్తే ఇంట్లో కంచాలు వాడరండి..''కుర్రాడు దాపరికం లేకుండా మాములు ధోరణిలో చెప్పేశాడు. ఆ మాట నర్సివయ్యకి ఛెళ్లున తగిలింది.

''అవును..కన్నోళ్లు పరాయోల్లే మరి..'' మనస్సు ఒక్కసారిగా చివుక్కుమంది. దూబమ్మ కూడా ఎంతగానో చలించిపోయింది. చలిగా ఉండటంతో ఇద్దరూ అక్కణ్ణుంచి గదిలోకి నడిచారు. దూబమ్మను ఏదో పరాయితనం వెంటాడసాగింది. నర్సింహయ్య ఏదో తప్పు చేసినవాడిలా బాధపడి

## ప్రపంచంలో అతి పెద్ద చిప్స్ ప్యాకెట్



**చిన్నవారి నుంచి పెద్దల వరకూ అందరికీ చిప్స్ అంటే నోట్లో నీళ్లూరుతాయి. సినిమా హాల్స్‌లోనూ, సాయంత్రం స్నాక్స్‌గా ఉపయోగపడే చిప్స్ గురించి పెద్దగా చెప్పవలసిన అవసరం లేదు. కరకలాడుతూ నోట్లో వేసుకోగానే కరిగిపోయే చిప్స్ ఎప్పుడు ప్రారంభం అయ్యాయంటే ... *1853*లో యునైటెడ్ స్టేట్స్‌లో మొట్టమొదటిసారిగా చిప్స్‌ను కనుగొన్నారు. అక్కడ నుంచి చిప్స్ వాడకం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకూ పాకింది.**

**మామూలుగా చిప్స్ ప్యాకెట్ అరచేయంత పరిమాణంలో వుంటుంది. కాకపోతే మరికొద్దిగా పెద్ద సైజులో దొరుకుతుంది. కానీ ఇటీవల జర్మన్ మ్యూజియంలో ప్రపంచంలోనే అతి పెద్ద చిప్స్ ప్యాకెట్‌ను ప్రదర్శించారు. నార్త్ వెస్ట్ జర్మనీలోని వ్రైడన్‌లో వున్న హోమ్‌లాండ్ మ్యూజియంలో ఈ చిప్స్ ప్యాకెట్‌ను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో సుమారు రెండువేల రకాల చిప్స్ ప్యాకెట్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన జూన్ ఒకటవ తేదీ వరకూ కొనసాగుతుంది. ఇంత పెద్ద చిప్స్ ప్యాకెట్ ఇంతవరకూ ఎక్కడా ప్రదర్శించలేదని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ధృవపరిచింది.**

పోయాడు. 'నా' అనుకున్నచోట అభిమానం ఆవ గింజంతయినా లేనందుకు ఎంతగానో నొచ్చుకున్నారు.

* * *

సాయంత్రం అయిదు–

కుర్రాడు టీ తీసుకొచ్చాడు. సుస్మిత కూడా అప్పుడే కాన్వెంట్ నుంచి వచ్చింది. కూతురు రావడం చూసి రాణి వెంటనే కిందికి దిగి వచ్చింది.

''ఏమే తల్లీ..'' దూబమ్మ కళ్లనిండా వెలుగు నింపుకొని మనవరాలి దగ్గరికి రాబోయింది.

''ముందు స్నానం చెయ్..వెళ్లు..''కూతుర్ని పైకి పంపించేసింది రాణి. మనవరాలికోసం దూబమ్మ పిచ్చిగా వరండాలోనే ఎదురుచూస్తూ కూర్చుంది. కొడుకు అప్పుడే కారు దిగాడు. తల్లీని, తండ్రిని చూశాడు.

''ఎంతయినా పల్లెటూరి గబ్బిలాలు..ఛస్తే మారరు..''చిరాకు పడ్డాడు దుర్గారావు.

''భోంచేశారా'' లాంఛనంగా అడిగాడు.

''అయింది బాబూ'' తల్లి చెప్పింది.

ఇంతలో ''డాడీ..'' అంటూ సుస్మిత నీలిరంగు మిడ్డీ వేసుకుని తండ్రి దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చింది. కూతురు వెనకాలే రాణి కూడ వచ్చింది.

''ఇటు రా తల్లీ..'' దూబమ్మ మళ్లీ ఆశగా చేతులు చాపింది.

''ఏం..హోం వర్కు చేసుకోవా..రా..'' అంటూ సుస్మితను తీసుకుని రాణి మేడ మీదికెళ్లిపోయింది.

రాత్రి తొమ్మిది దాటాక దుర్గారావు కిందికొచ్చాడు. తల్లిని, తండ్రినీ ఏవేవో అడిగాడు. మాటల మధ్యలో ''సిన్నోడా'' అంటూ దూబమ్మ మధ్యలో ఆగిపోయింది.

''ఏంకావాలి?'' దుర్గారావు అడిగాడు.

''ఏవీ లేదు..సిన్నదేదీ'' కళ్ల చివర వెలుగును నింపుకుంటూ అడిగింది.

''పడుకుంది..తెల్లారితే పరీక్షలు దానికి.. మీరు పడుకోండి, మీరు పైకి రాలేరేమో అని రాణి ఇక్కడే అన్నీ పురమాయించింది'' అంటూ సర్ది చెప్పాడు దుర్గారావు.

''నిజమే బాబూ..మేం పైకి రాలేము'' నర్సింహయ్య మనసులోనే బాధను అణుచుకుంటూ అన్నాడు. దుర్గారావు మొదటినుంచి భార్యావిధేయుడే!

''ఎంత దగ్గరోళ్లయినా మన స్టేటస్ కాపాడుకునే విషయంలో మీరు కాని, నేను కాని ఎప్పుడూ రాజీపడకూడదు'' అంటూ ఆమె ఆజ్ఞకు బద్ధుడైపోయాడు. కొడుకు మేడ మీదికెళ్లిన చాలా సేపటివరకు నర్సివయ్యకి నిద్రపట్టలేదు. మమకారం మచ్చుకైనా లేని ఇంట్లో అడుగుపెట్టడమే తప్పనిపించింది. సిన్నోడి సదువు సందెల కోసం తను పడిన యాతనలన్నీ గుర్తుకురాసాగాయి. దూబమ్మదీ అదే పరిస్థితి...

గుండె లేని మనుసుల నడుమ గాలి పీల్చటం మహా పాపమనిపించింది. తినీ తినక సిన్నోడి కోసం ఎన్నిసార్లు పస్తులున్నదీ, ఎన్ని కష్టాలు పడ్డదీ, అన్నీ మనసులో మెదిలాయి.

## రచయిత పరిచయం



స్వస్థలం: భట్లమకుటూరు (పశ్చిమ గోదావరి జిల్లా). ప్రస్తుత నివాసం: తణుకు. అన్ని సాహితీ ప్రక్రియలతో అంతో ఇంతో పరిచయం. 'రసభారతి' పద్య కవితా సంపుటి –బెంగుళూరు గుల్బర్గా విశ్వవిద్యాలయంలో పాఠ్య గ్రంథం. 'అసెంబ్లీ రౌడీ' చిత్రంలో బహుళ ప్రాచుర్యం పొందిన 'అందమైన వెన్నెలలోన...' అనే పాటకు ఉత్తమ సినీ గీత రచయితగా మదరాసు కళాసాగర్ అవార్డు. మధునాపంతుల, పింగళి, గడియారం, సినారె, తిలక్ అవార్డులు. సృజనాత్మక సాహిత్యానికీ, పద్యకవితా సంపుటి 'వేదిక'కు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాలు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది విశిష్ట సాహితీ పురస్కారం. 80 వరకు కథానికలు ప్రచురితాలు, కొన్నిటికి పురస్కారాలు. ఏ కవితా ప్రక్రియ అయినా మార్గదర్శకంగా ఉండాలనే అభిలాష. నా కథను ప్రత్యేక బహుమతికి ఎంపిక చేసిన నవ్యవీక్లి–సి.పి.బ్రౌన్ అకాడమీకి కృతజ్ఞతలు.

–రసరాజు

''అసలు పెద్దోడి కోసం ఇంత పట్టించుకొన్నామా..అయినా ఎంత ఇదిగా వుంటాడు మన మంటే..' దూబమ్మ ఎక్కడికో చూస్తూ అంది.

''అసలు ఆడి అభిమానమే వేరు.. ఏదో గాలికి పెరిగాడంతే..'' మంచితనం వుండబట్టి మావగారే అన్నారంలో ఆడికింత దారి చూపించారు.. ఆడికీ ఈడికీ ఎంత తేడో చూడు..'' నర్సింహయ్య కళ్ళల్లో పెద్దోడు చంద్రబింబంలా మెరిశాడు.

ఉన్నట్టుండి దూబమ్మ చూపు– గదిలో ఓ మూలగా పడింది. జంతికలూ..పొంగడాలూ..తాటిరొట్టె..డబ్బాల్లో అక్కడే మూలుగుతున్నాయి. మనసు నొచ్చుకుంది.

''అక్కడే వుంచండి..తీసుకుంటాం లే ''అన్న కోడలు వాటి మాటే మరిచిపోయింది.

''సిన్నోడికి ఇష్టమైన తాటిరొట్టె కాల్చి తెచ్చిందమ్మా మీ అత్తమ్మా'' అన్నాడు అక్కడికీ నర్సివయ్య.

''ఆయనకు పడదు లెండి'' అంటూ కొట్టిపారేసింది రాణి. చివరికి అందులో రెండు ముక్కలు రెండు కుక్కలకీ వేస్తే అవి ఆబగా తిన్నాయి. అవి మళ్లీ వచ్చి విశ్వాసంతో తోకాడిస్తూ పలకరించి వెళ్ళిపోయాయి.

* * *

తెల్లారింది.

పడుకునే గదికి పక్కనే అంటిపెట్టుకున్న స్నానాల గదులూ అవీ ఇద్దరికీ అంతగా నచ్చలేదు.

టీ పట్టుకొచ్చిన కుర్రాడు– గదిలో వున్న తినుబండారాల్ని అమ్మగారు తెమ్మన్నారని పట్టుకెళ్ళాడు.

''పోన్లే..వీటినైనా ఇంట్లోకి రానిచ్చింది''అనుకుంది దూబమ్మ.

ఆ రోజు ఆదివారం..

సుస్మిత రాత్రంతా టీవీలో కార్టూన్స్ చూసి ఆలస్యంగా లేచింది.

తొమ్మిది దాటాక తల్లితో పాటు సుస్మిత కూడా కిందికి దిగింది.

''అమ్మడూ..'' అంటూ ఆప్యాయంగా పిలిచాడు నర్సివయ్య.

''మళ్ళీ వస్తుంది లెండి..సైకిల్ నేర్చుకోవటానికి వెళ్తోంది'' అంటూ రాణి వరండాలో కుర్రాడికి సుస్మితను తీసుకెళ్ళమని సైగ చేసింది. ఆ సాయంత్రం కూడా సుస్మిత విషయంలో అదే పరిస్థితి. అయితే ఈసారి పాత్రలు మారాయి. సుస్మితను వెంటబెట్టుకుని దుర్గారావు కిందికిదిగాడు.

''ఇటు రామ్మా..సిట్టి తల్లీ..'' దూబమ్మ మమకారం చంపుకోలేక మళ్ళీ చేతులు చాపింది.

''అదిప్పుడు పార్కుకి వెళ్తోంది.. ఆడుకున్నాక వస్తుందిలే'' అన్నాడు దుర్గారావు. దూబమ్మ ఈసారి మరింతగా చిన్నబుచ్చుకుంది.ముద్దుమాట దేవుడెరుగు. వచ్చి రెండ్రోజులవుతున్నా మనవరాల్ని దగ్గరికి తీసుకులేకపోయామన్న బాధ ఆమెను పదేపదే సలుపుతోంది.

దుర్గారావు సుస్మితను తీసుకుని కారులో వెళ్లిపోయాడు. చేసేదిలేక ఇద్దరు గదిలోకి వచ్చి కుర్చున్నారు. ఆ రెండుకుక్కలు మళ్ళీ వచ్చాయి. నిన్నన వేసిన తాటిరొట్టె ముక్కలతో అవి మరింత చేరువయ్యాయి. వాటిని దగ్గరిగా తీసుకుని నర్సివయ్య ప్రేమగా నిమిరాడు.

పనిమనిషి అప్పుడే గదిలోకొచ్చింది. ''జంతికలూ.. పొంగడాలూ..బలే వున్నాయమ్మా..'' అంటూ తెగమెచ్చుకుంది.

''నీకెట్టా తెలుసు?'' నర్సివయ్య ప్రశ్నించాడు.

''మీరు తెచ్చినవన్నీ అమ్మగారు పనోళ్లకే ఇచ్చేశారు. అమ్మగారిది పెద్ద చెయ్యండి బాబూ'' అంటూ రాణిని ఒకటికి రెండుసార్లు పొగడ్తలతో ముంచేసింది పనిమనిషి. ఆ సంగతి వినగానే నర్సింహయ్య బాధపడలేదు. తనలో తాను వెకిలిగా నవ్వుకున్నాడు. కోడలు చేసిన పనికి దూబమ్మకు అరికాలి మంట నడినెత్తికెక్కింది. అయినా తమాయించుకుంది. పనిమనిషి వెళ్లిపోయింది.

''ఇన్నావా..'' అన్నాడు నర్సివయ్య దూబమ్మ కళ్లల్లోకి చూస్తూ.

''ఆ.. అన్ని సెవునబడ్డాయి'' అంది దూబమ్మ



## రజనీని కాదన్న సదా

ఇది నిజం!? ఎంత నిజం అంటే ఆకాశంలో సూర్యచంద్రులు ఉన్నంత నిజం అంటోంది సదా. శివాజీ సినిమాలో రజనీ సరసన హీరోయిన్‌గా నటించమని ముందు సదాకే అవకాశం వచ్చిందట! అయితే ఇటు బాలీవుడ్ అటు హాలీవుడ్ చిత్ర రంగాల్లో ఫుల్ బిజీగా ఉండడంతో అప్పుడా అవకాశాన్ని తనే వద్దందట! దాంతో ఆ అవకాశం శ్రియను వరించి ఇప్పుడామె పెద్ద హీరోయిన్ అయిపోయింది. లేకపోతేనా...అంటోంది సదా.

మూతి విరుస్తూ.

మరో గంటకు రాణి కిందికి దిగొచ్చింది. ఎవరో పేరంటాళ్లొస్తే కారులో వెళ్లిపోయింది.

''ఎంతయినా గొప్పింటి పిల్లమరి'' దూబమ్మ మనసు గాయపడింది.

''అందుకే మరి.. ఆ పిల్ల ఎంత సెపితే అంత సిన్నోడికి..'' నర్సివయ్య అన్నాడు.

రాణి వెళ్లిన పదినిమిషాలకి సుస్మిత వచ్చింది. కూడా దుర్గారావు రాలేదు.

''చూసేవయ్యా..పిల్లదాని ముక్కు అచ్చం నీలాగే కోలగా లేదూ'' అంది దూబమ్మ వస్తున్న మనవరాలిని పరిశీలనగా చూస్తూ.

''ఆ కళ్ళు సూడవే! నీ కళ్ళే అతికించినట్టులేవూ..'' అన్నాడు నర్సివయ్య ఆ పిల్లకేసి చూస్తూ.

''ఇటురా తల్లీ..'' ఇద్దరూ ఒకేసారి పిలిచారు. ఆ పిల్ల దూరంగా వచ్చి నిలబడింది.

''మీ నాన్నేడమ్మా'' నర్సివయ్య అడిగాడు.

''క్లబ్బుకెళ్లిపోయారు, నన్నిక్కడ దింపి''

''ఇటురాయే..'' అంటూ ఈసారి దూబమ్మ చనువుగా దగ్గరికి రాబోయింది.

''మీ దగ్గరికి వెళ్ళొద్దన్నారు'' అంటూ ఆ పిల్ల దూరంగా తప్పుకుంది.

''ఎవరమ్మా అలా అంది'' అడిగాడు నర్సివయ్య

''మమ్మీ..డాడీ..'' ఆ భాష అర్థంకాక వాళ్లిద్దరూ కుర్రాడి వైపు చూశారు. ఆ కుర్రాడు సమాధానంగా ''అయ్యగారు..అయ్యగారు'' అన్నాడు.

''ఎందుకు తల్లీ..'' నర్సివయ్యలో ఆశ్చర్యం పొడచూపింది.

''మీ దగ్గర కంపొస్తదని, వెళ్ళొద్దన్నారు''

''ఏం కంపు తల్లీ..'' అడిగింది దూబమ్మ.

''ముసిలోళ్ల కంపు'' అంటూ ఆ పిల్ల అక్కణ్ణుంచి మేడమీదకి ఉడాయించింది. ఆ మాట వినగానే ఒకరి ముఖాలొకరు వెర్రిగా చూసుకున్నారు. ఆ చూప్లు ఏదో బాధ సుళ్లు తిరిగింది.

''సూసేవటే దూబీ..పిల్ల ఏంసెప్పిందో''

''అంతేనయ్యా!మన నెత్తురే, ఎలా గడ్డకట్టుకుపోయిందో సూడు'' దూబమ్మ కంటతడి పెట్టుకుంది.

''ఊర్కోయే ఎర్రి మొగమా! ఇంటికాడ నే ముందే సెప్పాగా'' అంటూ నర్సివయ్య కూడా గుట్టుగ కళ్లు తడుపుకుని దూబమ్మ కళ్లు తుడిచాడు. ఇద్దరూ గదిలోకి వెళ్ళారు. అయిదు నిమిషాలు గడిచాయి.

కారు వస్తున్న శబ్దం వినిపించి కిటికీలోంచి చూశాడు నర్సివయ్య. అందులోంచి రాణి దిగింది. సుస్మిత మేడమీదినుంచి దిగొచ్చి తల్లిని వాటేసుకుంది. కుక్కలు రెండూ రాణి మీదకు ఎగబాకాయి. ''వీటితో ఆడుకో.. ఇప్పుడే వస్తా..'' అంటూ రాణి పూలకోసం పక్కనే వున్న మల్లెచెట్టు దగ్గరికి నడిచింది. వరండాలో వున్న దివాన్ కాట్‌పై సుస్మిత కూర్చుంటే, కుక్కలు ఆ మంచం మీదికెక్కాయి. వాటితో మనవరాలు ఆనందంగా ఆడుకోవటం గమనించారు దూబమ్మ, నర్సివయ్యలు.

''ఏమయ్యా! మనిద్దరం అలాగైనా పుట్టాంకాదు'' అంది దూబమ్మ ఎంతో బరువుగా. నిర్సివయ్య బాధతో ఏమీ బదులు పలకలేకపోయాడు.

రాణి సుస్మితను తీసుకుని మేడమీదికెళ్లిపోయింది. తొమ్మిది గంటలకు దుర్గారావు క్లబ్బు నుంచి వచ్చాడు. కొద్దిగా తూలుతున్నాడు. ఆ దృశ్యాన్ని కిటికీలోంచే గమనిస్తున్నారు. వచ్చిన గంటకే ''బెంగుళూరు కేంప్ వెళుతున్నా'' అంటూ దుర్గారావు వెళ్లిపోయాడు.

ఆ రాత్రి దూబమ్మకీ, నర్సివయ్యకీ ముద్ద మింగాలనిపించలేదు.

* * *

''రేపొద్దున్నే రాజోలు వెళ్తాం తల్లీ..'' అన్నాడు నర్సివయ్య కోడలితో. కుక్కలు రెండూ వచ్చి నర్సివయ్య కాళ్ళచుట్టు తిరిగాయి.

''వచ్చారుగా ఉండండి'' అంది రాణి మాట వరసకి.

''అది కాదు తల్లీ! సేలో పనులున్నాయి'' అన్నాడు నర్సివయ్య పెళ్ళాం వైపు తిరిగి.

''నిజమేనమ్మా! వెళ్ళాలి'' అంది దూబమ్మ మొగుడి మాటను మన్నిస్తూ.

''సరే.. మీ ఇష్టం..'' అంది రాణి ముక్తసరిగా.

నర్సివయ్య మళ్ళీ తలపాగా బిగించాడు. నెత్తిపై పెట్టె పెట్టుకున్నాడు. డబ్బాల్లో ఏమీ లేకపోయినా అవి ఎందుకో బరువుగా అనిపించాయి. వాటిని దూబమ్మ పట్టుకుంది. వరండాలో కుర్రాడు లేకపోవడంతోకారు తుడుస్తున్న డ్రైవర్‌ని కేకేసింది.

''వీళ్లను రిక్షా ఎక్కించమని గేట్‌మెన్‌తో చెప్పు.. '' రాణి ఆదేశించింది.

''ఏదమ్మా సంటిది..'' ఆశ చావని దూబమ్మ ఓ పక్క ఓడిపోతూనే చివరిసారిగా అడిగింది.

''బాత్‌రూమ్‌లో దూరింది, ఇప్పుడప్పుడే తెమల్దు'' అంది రాణి.

ఇద్దరూ భారంగా ముందుకు నడిచారు. డ్రైవరు గేట్‌మేన్‌కు పురమాయించేడు. గేట్‌మెన్‌తో ''ఎళ్ళొత్తాం బాబూ..'' అన్నాడు నర్సివయ్య వెనక్కి తిరిగి. అలా వెనక్కి తిరిగినప్పుడు ఆ గేటు మీద ఏదో బోర్డు కనిపించింది. వాళ్ళొచ్చినప్పుడు దాన్ని గమనించలేదు.

''అదేమిటి బాబూ?'' అడిగాడు నర్సివయ్య. గేట్‌మెన్ చెప్పాడు.

అది విన్నాక నర్సివయ్యకు నవ్వు ఆగిందికాదు. పైకే నవ్వేశాడు.

''పిచ్చోడు'' అనుకున్నాడు గేట్‌మెన్. దూబమ్మ నర్సివయ్యను దారిలో అడిగింది

''దేనికయ్యా నవ్వావు'' అని.

నర్సివయ్య మళ్ళీ విన్నాడు.

''ఏందయ్యా'' అంది దూబమ్మ ఏమీ అర్థంకాక.

''ఏమీలేదే.. గేటుకి బయట'కుక్కలున్నవి జాగర్త' అనే బోర్డు తగిలించారు మనోళ్లు.. అయి విశ్వాసం గల జంతువులు కదా..తప్పు రాయించారామో అనిపించి నవ్వొచ్చింది, అంతే..'' అంటూ మళ్ళీ నవ్వాడు నర్సింహయ్య.

''మరేం రాసుండాలేటి?'' దూబమ్మ అమాయకంగా ప్రశ్నించింది.

★